వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# సరస్వతి దేవిగా వాసవిమాత



పులివెందుల టౌన్, మే 17, ప్రభాతవార్త : పులివెందులలోని అమ్మవారిశాలలో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు శుక్రవారం సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవిమాత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వైభవంగా వాసవిమాతాకు బియ్యంతో వైభవంగా పాదాభిషేకం



## గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి : పరిసీలించిన సిఐ, కేసు నమోదు



## ట్రిపుల్ఐటీపరిపాలనాధికారిగా పెనుగొండు రవికుమార్ నియామకం





## నేడు వాసవీ జయంతి ఉత్సవాలు

# రైల్వే కోడూరులో... నువ్వా...నేనా...

రిజర్వుడు నియోజకవర్గమైన రైల్వే కోడూరులో ఈ దఫా ఎన్నికలలో రాజకీయపక్షాలకు ఓటర్ నాడీ అంతు పట్టడం లేదు. పోలింగ్ అనంతరం నేతలు కాకి లెక్కలతో తలలు పట్టుకుంటున్నారు. గెలుపు తమదంటే తమదంటున్నారు. నాలుగు సార్లు వరుస విజయాలతో ఊపు మీద ఉన్న వైసిపి అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు ఐదోసారి తన విజయం ఖాయమని చెబుతున్నారు. కూటమి నేతలు రైల్వే కోడూరులో ఎగిరేది తమ జెండానే అని బల్ల గుద్ది చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తమకు అనుకూలంగా ఉన్నాయని లెక్కలు చెబుతున్నారు. సాంప్రదాయ ఓటుపైనే ఆధారపడిన వైసిపికి క్రాస్ ఓటింగ్ కలవరపెడుతోంది. మరోవైపు కూటమి నేతలు ఏకతాటిపై నిలచడం జనసేనకు కలిసి వచ్చే అంశం. వైసీపీలో కీలక నేతకు ఆయనపై ఓ సామాజికవర్గం లో వున్న వ్యతిరేక ఓటు చేటు తెస్తుందని ఆ పార్టీలో అంతర్గతంగా సాగుతున్న ప్రచారం. మొత్తానికి రైల్వే కోడూరులో పోటీ మాత్రం నువ్వా నేనా అన్నట్లు కనిపిస్తోంది. నియోజకవర్గంలో 2,04,466ఓటర్లు ఉండగా1,52,352 ఓట్లు పోలయ్యాయి.
రాజంపేట అర్బన్, మే17 ప్రభాతవార్త






## గెలిచేది ఎవరు? నిలిచేది ఎవరు? కాకి లెక్కలతో తల పట్టుకుంటున్న నేతలు

రైల్వేకోడూరు నియోజకవర్గం పునర్విభజన ముందు వరకుతెలుగుదేశం పార్టీకి కంచుకోటగా వుండేది. పునర్విభజన తర్వాత రాజంపేట నియోజకవర్గం లో ఉన్న పెనగలూరు మండలం కలిసిన నేపద్యంలో వైసిపికి తిరుగులేని ఆదిపత్యం కొనసాగుతోంది. అయితే తెలుగుదేశం పార్టీకి నాయకత్వం లోపం శాపంగా మారింది. ఎవరికి వారే యమునా తీరు అన్నట్లుగా తయారైంది. వర్గ రాజకీయాలు పార్టీకి శాపంగా మారాయి. దీంతో నాయకత్వం మార్పిడిపై అధిష్టానం నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఇన్చార్జిగా రూపానంద్ రెడ్డిని నియమిస్తూనే సమాంతరంగా గెలుపు బాధ్యతలను చంగల్ రాయుడు ,విశ్వనాథ నాయుడులకు కూడా అప్పగించింది. అంతేకాకుండా గత ఎన్నికల ఫలితాలను అధ్యయనం చేసి బత్యాల వర్గానికి కానీ ఇటు విశ్వనాథ్ నాయుడు వర్గానికి సంబంధించిన వారిని అభ్యర్థిగా ఎంపిక చేయకుండా ఆర్థికపరమైన అంశాలను ఎవరు బాధ్యతగా తీసుకుంటారో వారికే అభ్యర్థి ఎంపికను వదిలేసింది. దీనికి తోడు తెలుగుదేశం అభ్యర్థిని కాకుండా పొత్తులో భాగంగా వ్యూహాత్మకంగా జనసేనకు కేటాయించడం ఫలితాన్ని ఇచ్చింది.

ముగ్గురు నేతలు ఒకటయ్యారు. వారికి కేటాయించిన బాధ్యతల మేరకు మెజార్టీ చూపించేందుకు సర్వశక్తులు వడ్డారు. ఫలితంగా కోడూరు లోనాలుగు సార్లు విజయం సాధించిన వైసిపికి గట్టి పోటీ ఇచ్చే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఓటుకు నోట్లు పంపిణీ చేసే విషయంలో కూడా అధికార పార్టీకి పోటీగా నిలిచారు. ఇకపోతే వైసిపి అభ్యర్థి శ్రీనివాసులుకు పార్టీలో కొందరు నేతల అసంతృప్తి కూడా లేకపోలేదు. ఈ విధంగా వైసిపి,కూటమి మధ్య హెూరాహెూరీ పోరు జరిగింది. తెలుగుదేశం పార్టీకి రైల్వే కోడూరు, ఓబులవారిపల్లె ,చిట్వేలి మండలాల్లో ఆదిక్యత వస్తుందని ఆ పార్టీ నేతలు బల్లగుద్ది చెబుతున్నారు. రైల్వే కోడూరులో లభించే మెజారిటీ కూటమికి నిర్ణయాత్మకంగా మారింది. ఈ మండలంలో లభించే మెజార్టీ ఆధారంగానే కూటమి అభ్యర్థి అరవ శ్రీనివాసులు విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.ఇక్కడ 5000 మెజార్టీ తగ్గదని కూటమి భావిస్తోంది. మరోవైపు ఓబులవారిపల్లెలో 3000, చిట్వేలి లో 2000 మెజార్టీ వస్తుందని ధీమా గా ఉన్నారు. జనసేన నేతలు మాత్రం రైల్వేకోడూరు మండలంలో 7000 దాకా మెజార్టీ చేస్తుందని చెబుతున్నారు. ఏది ఏమైనా ఈ మూడు మండలాల్లో టిడిపి మెజార్టీ ఖాయమని స్పష్టం చేస్తున్నారు. వైసీపీలో మాత్రం ఓబులవారిపల్లెలో తమకే మెజార్టీ వస్తుందని అంచనా వేస్తున్నారు. కూటమి నేతలు దీనికి కౌంటర్ గా ఓబులవారిపల్లె మండలం నుంచి అభ్యర్థి పోటీ చేస్తున్న నేపథ్యంలో లోకల్ ఫీలింగ్ వచ్చిందని, రెడ్డి సామాజిక వర్గంలో కూడా కొంతవరకు ఓట్ల చీలిక జరిగిందని వ్యాఖ్యలు చేస్తున్నారు. ఏది ఏమైనా క్షేత్రస్థాయిలో పరిస్థితిలో అంచనా వేస్తే ఓబులవారి మండలంలో టిడిపి మెజార్టీ ఖాయమని తెలుస్తోంది. ఇకపోతే భారీ మెజార్టీ వస్తుందని వైసిపి భావిస్తున్న పెనగలూరు మండలంలో ఈ ఎన్నికల్లో ఏ మేరకు వస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. ఈ మండలంలో 4000 మెజార్టీ మించి రాదని టిడిపి నేతలు చెబుతున్నారు. పుల్లంపేట మండలంలో కూడా వైసిపికి ఈ దఫా 3500లోపు మెజార్టీ మించి రాదనేది ఆ పార్టీ వర్గాల్లో కూడా ప్రచారం జరుగుతుంది. ఏది ఏమైనా పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో వచ్చే మెజార్టీ ఆధారంగానే వైసిపి గెలుపు ఆధారపడి ఉంటుందనడంలో సందేహం లేదు. మూడు మండలాలలో ఏ పార్టీ అభ్యర్థికి మెజార్టీ లభిస్తుందో ఆ పార్టీ గెలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా తక్కువ మెజార్టీతోనే అనే ప్రచారం తటస్థ ఓటర్లలో వినిపిస్తోంది.

# సింహ వాహణంపై అగస్త్యేశ్వర స్వామి



ప్రొద్దుటూరు అర్బన్, మే 17, ప్రభాతవార్త:
అగస్త్యేశ్వరాలయంలో నిర్వహిస్తున్న వార్శిక బ్రహోత్సవాలలో భాగంగా నాలుగవ రోజు స్వామి వారికి మహాన్యాస పూర్వకపఏకాదశ రుద్రాభిషేకములు, అమ్మవారికి కుంకుమార్చనలు, మండల స్థిత దేవదలకు పూజలు, దీక్షా నిత్యాపాసన హోమములు, నిత్య బలిహరణ గ్రామోత్సవం, శ్రీ లలితాసహస్ర నామ స్తోత్ర పారాయణము బూతూరు వెంకట రామిరెడ్డి వారిచే 200మంది భక్తులతో 5 సార్లు పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మండలస్థిత దేవతలకు పూజలు, దీక్షా నిత్యోపాసన హోమములు, నిత్య బలిహరణ శ్రీ గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారికి సింహ వాహణంపై ప్రొద్దుటూరు పురవీధులలో ఊరేగింపు, సాంస్కృతిక పరంగా నృత్య తరంగిణి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ వారిచే కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శణ కార్యక్రమాలు నిర్వహించారు.

# ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల పరిశీలన

- 247 మూడంచల భద్రత.. కేంద్ర బలగాలు పహారా- సీసీ కెమెరాల చిత్రీకరణ, ఈవీఎంల భద్రతపై సమీక్ష
- స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు భవనాలు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

రాయచోటి అర్బన్, మే 17, ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లాకు చెందిన ఆరు అసెంబ్లీ, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాలకు చెందిన పోలింగ్ అయిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరచడం జరిగిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ తెలిపారు. శుక్రవారం సాయి ఇంజినీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్ రూంలను పరిశీలించి అక్కడ రిజిస్టర్లో కలెక్టర్, ఎస్పీలు సంతకాలు చేయడం జరిగింది. అనంతరం స్ట్రాంగ్ రూంలో భద్రతా, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ సాయి ఇంజినీరింగ్ కాలేజీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్, డీఎస్పీ మొబైల్ టీం, సీఆర్పీఎఫ్ ఆర్మ్డ్ రిజర్వు ఫోర్సెస్, రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూంల వద్ద 144 సెక్షన్ కౌంటింగ్ ముగిసే వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఆదేశాల మేరకు జిల్లా ప్రజలందరూ ఎటువంటి ఉల్లంఘటనలకు పాల్పడకుండా జిల్లా యంత్రాంగానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.



# భక్తి, శ్రద్దలతో బ్రహ్మంగారి నంది ఉత్సవం





బ్రహ్మంగారిమఠం , మే 17 ప్రభాతవార్త :
జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి 331 ఆరాధనోత్సవాల సందర్భంగా 4వ రోజు నంది వాహనంలో శ్రీ వీరబ్రహ్మేంద్రసామి ఉత్సవం భక్తి,శ్రద్దలతోసాగింది. అలాగే మఠం పురవీధులుభక్తులతో కళకళలాడుతూ కనిపించాయి. బ్రహ్మంగారిమఠం యాజమాన్యం భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, మంచినీరు,
వసతిగదులు, విద్యుత్ సౌకర్యం, అన్నదాన ఏర్పాట్లు అడుగడుగునా ఆద్యాత్మికతతో కూడిన సౌకర్యాలను పిట్పర్సన్
శంకర్ బాలాజీ ఏర్పాటు చేశారు. దర్శనానికి వెళ్లే భక్తుల కోసం క్యూలైన్లో ఫిట్పర్సన్ శంకర్బాలాజీ, పూర్వపుమఠాధిపతి పెద్ద కుమారుడు వెంకటాద్రి స్వామి మంచినీళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. వీటితోపాటు వివిధ సామాజిక వర్గానికి చెందిన అన్నదాన సత్రాలు భక్తులకు అన్నదానం నిర్వహించడంలో ముందున్నాయి. పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఉత్సవాల ఏర్పాట్లతో పాటు వివిధ సమాజిక వర్గానికి చెందిన అన్నదాన సత్రాలు భక్తులకు అన్నదానం నిర్వహించడంలో ముందున్నాయి. పలు ప్రభుత్వశాఖల అధికారుల ఉత్సవాల ఏర్పాట్లతో పాటు భక్తుల సేవలో నిమగ్నమై ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటున్నారు. పిట్పర్సన్ శంకర్ బాలాజీ, మఠం మేనేజర్ ఈశ్వరయ్య పర్యవేక్షణలో భక్తులకు మెరుగైన వస్తువులు కల్పించడం జరిగింది. 17వ తేది శుక్రవారం జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన పవిత్ర దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో అన్నిఏర్పాట్లు సిద్దం చేశారు. బ్రహ్మంగారి దీక్షబంధనాలంకరోత్సవం నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణలో మఠం శోభాయమానం సంతరించుకుంది.

# డ్రైనేజీ కాలువ శుభ్రం చేయించిన మున్సిపల్ కమిషనర్





బద్వేలు అర్బన్, మే 17 (ప్రభాతవార్త): బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని సిద్దవటం రోడ్డు పద్మావతి హాస్పిటల్ వెళ్లే రహదారి మెయిన్ రోడు డ్రైనేజీ కాలువ పూర్తిస్థాయిలో నిండిపోయి ప్రవహించడంతో శువ్రారం వార్త దిన పత్రికలో 'చీ..చీ కంపు బాబోయ్ కంపు' అనే శీర్షిక వెలువడింది. ఇందుకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ తక్షణమే సంబంధిత స్థలం వద్దకు చేరుకుని డ్రైనేజీ కాలువను తమ సిబ్బంది ద్వారా పరిశుభ్రం చేయించారు. దీంతో అక్కడ ఎలాంటి మురికి నీరు లేకుండా తొలగిపోయింది. అలాగే ఆయన మార్నింగ్ వాక్లో మున్సిపల్ కమిషనర్ తన సిబ్బందితో మురికి నీటి కాలువలను పరిశీలించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పాటు పడతామన్నారు. అలాగే డ్రైనేజీలపై అక్రమ కట్టడాలు కట్టరాదని అలాంటి వారిపై చర్యలు చేపడతామని సూచించారు. ఇలా అక్రమ కట్టడాల ద్వారా పలుచోట్ల మురికి నీరు నిలిచిపోయి వాటిని తొలగించేందుకు ఇబ్బందిగా మారుతుందని కావున ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించాలన్నారు.

## ఎల్ఐసీ - శాంతిగిరి ఆధ్వర్యంలో

# ఉచిత వైద్యశిబిరం జయప్రదం




కడప వైద్యవిభాగం, మే 17, ప్రభాతవార్త: ఆధునిక వైద్యం బాగా విస్తరించిన నేటి కాలంలో కూడా ప్రాచీన వైద్య విధానాలైన ఆయుర్వేద, సిద్ద వైద్య విధానాలు నేటికీ అనుసరణీయమని కడప ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ అన్నారు. స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఆవరణలో ఎల్ఐసీ – శాంతిగిరి ఆయుర్వేద సిద్ధ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయుర్వేదం వ్యాధిని నయం చేయడంపై దృష్టి పెడితే సిద్ధ ఆరోగ్యాన్ని సమకూరుస్తుందని శారీరక వ్యవస్థ మొత్తాన్ని పునరుజ్జీవం చేస్తుందన్నారు. మొండి వ్యాధుల్ని దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యని పరిష్కరించడంలో ఈ వైద్య విదానాల ప్రాధాన్యత అందరూ గుర్తిస్తున్నారన్నారు. ఏ వైద్య విధానం ఎంచుకుంటామన్నది వ్యాధి స్వభావంపై ఆధారపడి ఉంటుందన్నారు. శాంతిగిరి ఆయుర్వేద – సిద్ధ హాస్పిటల్ బాధ్యులు వైద్యశిబిరంలో పాల్గొన్న ఆరోగ్య నిపుణులు డా.ఆదర్శ్ అజయ్, డా.వందన టీఎస్‌లు మాట్లాడుతూ వెన్ను నొప్పి, మోకాళ్ల నొప్పి, కీళ్ల నొప్పి, చర్మ సంబంధ సమస్యలు వీటికి శిబిరంలో కన్సల్టేషన్, వైద్య సేవలు అందించామన్నారు. దేవుని కడపలో ఉన్న తమ కేరళ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్, వార్డ్ రూంల సౌకర్యాలతో సాంప్రదాయక పంచకర్మ వైద్యాన్ని కూడా అందిస్తున్నామని రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారన్నారు. 50 మందికి పైగా ఉపయోగించుకున్న ఈ ఉచిత శిబిరంలో శాంతి గిరి ఆసుపత్రి మేనేజర్ మోహనన్, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, సీనియర్ థెరపిస్టులు మను, మిథున్ సేవలు అందించారు. ఎల్ఐసీ ఓఎస్ మేనేజర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉచిత వైద్యశిబిరంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యాం సుందర్‌రావు, ఎసేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, ఆనందరావు, రఘునాథ్‌రెడ్డి, అవధానం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో యువకుల ఘర్షణపై ఇరు వర్గాలపై కేసు నమోదు

ముద్దనూరు, మే 17, ప్రభాతవార్త: ముద్దనూరు పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల సమీపంలో మద్యం మత్తులో యువకులు ఘర్షణలో పది మందిపైశుక్రవారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా ముద్దనూరుమండల పరిధిలో ఎటువంటి గొడవలకు పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేస్తామన్నారు.

# ఉక్కు ప్రవీణ్ టిడిపికి ద్రోహం చేశాడు

## టిడిపి నాయకుడు కామిశెట్టి బాబు



ప్రొద్దుటూరు అర్బన్, మే 17, ప్రభాతవార్త: ప్రొద్దుటూరు ఇన్చార్జిగా ఉన్న ఉక్కు ప్రవీణ్‌కుమార్ రెడ్డి 13వ తేది జరిగిన ఎన్నికల్లో టిడిపికి ద్రోహం చేశారని టిడిపి నాయకులు కామిశెట్టి బాబు విమర్శించారు. నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తనకు టిడిపి ఎమ్మెల్యే టికెట్ రాలేదని కసితో తన అనుచరులను వైసీపీలోకి పంపించి వైసీపీకి ఓట్లు వేయాలని చెప్పడం తగదన్నారు. టిడిపి టికెట్ కోసం సీఎం సురేష్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి లాంటి వారు ప్రయత్నించినప్పటికి టికెట్ రాకపోయిన పార్టీకి కట్టుబడి పనిచేశారని, ఉక్కు ప్రవీణ్ మాత్రం టీడిపికి వ్యతిరేకంగా పనిచేయడం టిడిపి అధిష్టాణం గుర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, చీమల రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## అధిక రక్తపోటుతో జాగ్రత్త-డాక్టర్ కావ్య మాధురి



చాపాడు, మే 17, ప్రభాతవార్త: అధిక రక్తపోటుతో ప్రజలు జాగ్రత్త వహించాలని, హై బీపీని తక్కువ అంచనా వేయకూడదని ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిడాక్టర్ పి.కావ్యమాధురి రోగులకు తెలియజేశారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో హై బీపి గురించితెలియజేశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ హై బీపీ వలన ప్రాణానికి ప్రమాదం అని, దీని వలన తల నొప్పి, ఛాతి నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం,వికారం, వాంతులు, దృష్టి మసకబారడం, ఆందోళనగా ఉండటం, చెవులలో శబ్దాలు వంటివి హై బీపీకి సంకేతాలు అని తెలిపారు. హై బీపీ తగ్గించుకోవాలంటే ప్రతిరోజుఉదయం, సాయంత్రం వ్యాయామంతో పాటు ఆహారంలో ఉప్పు కారం తగ్గించడం, మధ్యపానం, ధూమపానం వంటిని ఆపేయడం వలన మంచిదన్నారు. ఉప్పును తగ్గిస్తే ప్రతి ఏటా 25లక్షల ప్రాణాలు కాపాడుకోవచ్చు అని ఆమె తెలిపారు. అధిక ఉప్పు వలన రక్తపోటు, గుండెజబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ ఉందన్నారు. ప్రతి రోజు 5 గ్రాములకంటే ఎక్కువ ఉప్పు తీసుకోకూడదని తెలిపారు. ఉప్పు బదులు సుగంధద్రవ్యాలు వాడుకోవాలని సూచనలు చేశారు. హై బీపీ ధ్యానం ద్వారా కోపాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్ బాబు రెడ్డి, ఫార్మసిస్ట్ సుభాషిని, స్టాఫ్ నర్స్ సావిత్రి, రోగులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

### సీఐ రామాంజులు




ఖాజీపేట, మే 17, ప్రభాతవార్త: ఎన్నికల నేపధ్యంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఖాజీపేట సీఐ రామాంజులు శుక్రవారం ఒక ప్రకటనలోపేర్కొన్నారు. పోస్ట్ పోల్ సంఘటనలు దృష్టిలో పెట్టుకొని ఎవరైనా గొడవలు, ఘర్శణలకు పాల్పడితే అటెంట్ మర్డర్ వంటి నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కుతరలిస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రాజకీయ పరంగా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వారిపై మరియు గ్రూప్ అడ్మిన్‌పైన తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దయచేసి ఎవరూ కూడ గొడవలు పెట్టుకోవద్దని, ఏదైన సమస్యలు ఉంటే ఖాజీపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల అనుచరులు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలజి సీఐ రామాంజులు కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖాజీపేట, మే 17, ప్రభాతవార్త:

సబ్‌స్టేషన్ మరమ్మత్తు పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మరమ్మత్తు పనులు చేపట్టామన్నారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఈ విశయాన్ని ఖాజీపేట మండలంలోని అర్బన్, రూరల్ ప్రాంత వినియోగదారులు గమనించాలని కోరారు.

## పొట్టకూటి కోసం వెళ్తూ మధ్యలో పరలోకానికి



రామాపురం, మే 17, ప్రభాతవార్త: పొట్టకూటి కోసం వెళ్తూ మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపువాండ్లపల్లెలో చోటు చేసుకుంది. కర్ణపువాండ్లపల్లెకు చెందిన కడప బాషా(56) ప్రతి రోజు చింతచిగురు కోసుకొని పొట్ట నింపుకునే దానికి కడప మార్కెట్‌కు వెళ్లి చిగురు విక్రయించి జీవనం సాగిస్తూ ఉండేవాడని రోజూ మాదిరే శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల మధ్యలో బైక్‌పైన చింతాకు తీసుకొని మార్కెట్‌కు పోతున్న సమయంలో చింతకొమ్మదిన్నె మండలం మూలవంక పెట్రోలు బంకు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక మార్కెట్ కమిటీ ఛైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అతని భార్య బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లింది. భర్త మరణ వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన కువైట్ నుంచి స్వగృహానికి బయలుదేరిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాషా మృతితో కర్ణపువాండ్లపల్లెలో విషాదచాయలు అలుముకున్నాయి.

## నేడు వాసవీ జయంతి ఉత్సవాలు



రామాపురం, మే 17, ప్రభాతవార్త:

మండలంలోని నీలకంఠారావుపేట గ్రామంలో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శనివారం నుంచి వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆర్యవైశ్య సంఘ సభ్యులు తెలిపారు. ఉదయం5గంటలక ప్రార్థన గణపతి పూజ స్వస్తివాచకం అమ్మవారికి పంచామృతాభిషేకం మంగళహారతి, కుంకుమార్చన మొదలైన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## టీడీపీ పార్లమెంట్ బీసీ సెల్ కార్యదర్శిగా అశోక్‌కుమార్



తంబళ్లపల్లె, మే 17, ప్రభాతవార్త: తెదేపా రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శిగా గుట్టపాలెం అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ విషయమై రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సురేంద్ర శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశోక్‌కుమార్ తంబళ్లపల్లె మండలంలో తెదేపా అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఫలితమే ఈ పార్టీ పదవి దక్కినట్లు చెప్పారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శి పదవి రావడానికి సహకరించిన మాజీ సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పార్లమెంటు అధ్యక్షుడు సురేంద్రకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ కోసం అహర్నిశలు పని చేశానని భవిష్యత్తులో సైతం తెదేపా అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఉపశమనం పొందిన ప్రజానీకం

కడప కార్పొరేషన్, మే 17, ప్రభాతవార్త: మొన్నటి వరకు భగ భగ మండిపోయిన భానుడు శాంతించాడు. ఉరుములు, మెరుపులతో కూడిన పలు చోట్ల వర్షాలు పడుతుండడంతో వేసవి తాపం నుంచి కడప జిల్లా ప్రజలకు కొంత ఉపశమనం కలిగినట్లయింది. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఒక్క సారిగా వాతావరణం చల్లబడింది. మొన్నటి వరకు ఎండలు దంచికొట్టాయి. దీంతో జిల్లా ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఒక్క సారిగా వాతావరణం చల్లబడడంతో పాటు గత రెండు రోజులుగా సాయం సంధ్య వేళల్లో చల్లటి ఈదురుగాలులు వీస్తుండడం, చిరు జల్లులు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. వేడి గాలుల స్థానంలో చల్లగి గాలులు ఊరటనిస్తున్నాయి. మొన్నటి వరకు జిల్లాలో 46 డిగ్రీల వరకు వెళ్లిన ఉష్ణోగ్రతలు ఒక్క సారిగా ఐదారు డిగ్రీలు పడిపోయింది. దీంతో ప్రజలకు ఊరట లభించింది.

## అధిక రక్తపోటుతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి-డాక్టర్ ముబీన్

ఖాజీపేట, మే 17, ప్రభాతవార్త: ప్రాధమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ ముబీన్ ఆధ్వర్యంలో ప్రజలకు సమావేశం, ర్యాలీల ద్వారా అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించడమైనది. ఖాజీపేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 11 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లలో హైపర్ టెన్షన్ డే నిర్వహించారు. ఈ సంధర్భంగా డాక్టర్ ముబీన్ మాట్లాడుతూ 30సంవత్సరాలు పైబడిన ప్రతి వ్యక్తికి వైద్య పరీక్షల్లో భాగంగా రక్తపోటును ప్రతి నెల గాని, మూడు నెలలకు ఒకసారి గాని,



సంవత్సరానికి రెండుసార్లు అయినా బి.పి పరీక్ష చేసుకొని అధిక రక్తపోటు ఉన్నవారికి ప్రతి ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో గవర్నమెంట్ హాస్పిటల్ నందున మాత్రలు ఇస్తామన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం మాట్లాడుతూ శారీరక శ్రమ, రోజువారి వ్యాయామం కొనసాగించాలని, ఆహార నియమాలు పాటించాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ ఏ.శోభన్ బాబు, బి.కృష్ణ ప్రియా, స్టాఫ్ నర్స్ లక్ష్మి కాంతమ్మ, ఫార్మసీ ఆఫీసర్ కేశవయ్య, నాగార్జున, శోభా పాల్గొన్నారు.

## గొడవలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ నమోదు చేస్తామన్న సీఐ దస్తగిరి

ముద్దనూరు, మే 17, ప్రభాతవార్త: ముద్దనూరు స్థానిక అప్డేట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నాడు విలేకరుల సమావేశంలో సీఐ దస్తగిరి మాట్లాడుతూ సాధారణఎన్నికల తర్వాత జరుగుతున్న సంఘటనలపై ముద్దనూరు మండల ప్రజలకు మరియు వివిధ రాజకీయ పార్టీల వారికి తెలియజేయడం ఏమనగా రాష్ట్రంలో జరుగుతున్నపోస్ట్ పోల్(ఎన్నికల తరువాత) జరుగు సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఎవరైనా, ఎంతటి వారైన సరే గొడవలు పెట్టుకొని కొట్టుకుంటే వారిపై నాన్ బెయిలబుల్ కేస్‌లురిజిష్టర్ చేసి వెంటనే రిమాండ్‌కి పంపడం జరుగుతుందని, అదేవిధంగా రౌడీ షీట్స్ కూడ ఓపెన్ చేసి గ్రామ బహిష్కరణ చేయడం జరుగుతుందని అన్నారు. సోషల్ మీడియాలోరాజకీయ పరంగా రెచ్చగొట్టే విధంగా పోస్ట్‌లు పెట్టిన వారిపై మరియు గ్రూప్ అడ్మిన్‌పైన తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ కూడ ఎలాంటి గొడవలు=పెట్టుకోవద్దని ఏదైనా సమస్యలు ఉంటే పోలీసులకు తెలియపరిచి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మైనుద్దీన్, స్టేషన్‌సిబ్బంది పాల్గొన్నారు.



## పెద్దకురప్పల్లెలో వైద్యక్యాంపు



రామసముద్రం, మే 17 ప్రభాతవార్త :

రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయితీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో రక్తపోటు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వైద్యక్యాంపును డాక్టర్ నూరుల్లా ఆధ్వర్యంలో ఆయుస్మాన్ ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బిఫి,షుగర్ ఉన్న రోగులు క్రమం తప్పకుండా మందులను వాడాలన్నారు. ప్రతిరోజూ 6నుంచి 8గంటల సేపు నిద్రపోవాలని సూచించారు. మద్యం, దూమపానం, గుట్కా అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మన ఆరోగ్యం మనమే జాగ్రత్తగా చూసుకోవాలని సిహెచ్ఓ ఉమాదేవి తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం గీతారాణి, భానుప్రియ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

## రక్తపోటు నివారణతో ఆరోగ్యం కాపాడుకోండి - జూనియర్ సివిల్ జడ్జీ ఉమర్ ఫరూక్

తంబళ్లపల్లె, మే 17, ప్రభాతవార్త:




ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమ నిబంధనలలో భాగంగా రక్తపోటుపై జాగ్రత్త వహించి నివారణతో ఆరోగ్యం కాపాడుకోవాలని తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జీ ఉమర్ ఫరూక్ సూచించారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన రక్తపోటు దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాలు, సూచనలు, ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆకాంక్షించారు. మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్య మాట్లాడుతూ ప్రతి మనిషి దైనందిక జీవితంలో రక్తపోటు సహజమని హై బీపీని తక్కువ అంచనా వేయకూడదని నిర్లక్ష్యంగా ఉంటే ఒక్కోసారి ప్రాణానికి ప్రమాదమని హెచ్చరించారు. రక్తపోటు నివారణకు ముందస్తుగా నిరంతర వ్యాయామం చేయడంతో పాటు ఆహారంలో ఉప్పు, కారం తగ్గించడం, మద్యపానం, ధూమపానం పూర్తిగా నలిపితే హైబీపీ నియంత్రించవచ్చన్నారు. అనంతరం ఎన్‌డీసీ డా.రిచర్డ్, డా.విక్రాంత్‌రెడ్డి, డా.తేజస్వినిలు రక్తపోటుతో పాటు ఆరోగ్య సమస్యలపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీ సిబ్బంది శారద, సుమతి, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, బాలాజీ, ఆసుపత్రి కమిటీ సభ్యులు మెడికల్ నారాయణరెడ్డి, రామ్మూర్తి, ఆర్‌బీకే ఛైర్మన్‌రెడ్డి మల్‌రెడ్డి, వైద్యసిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం..



ప్రొద్దుటూరు క్రైం, మే 17, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణం పెన్నానగర్‌కు చెందిన షేక్ మస్తాన్ వల్లీ గురువారం సాయంత్రం మందుల కోసం వెళ్లి తిరిగి రాలేదని అతని కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతనికి మతిస్థిమితం సరిగా లేదని ఆచూకీ తెలిసిన వారు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో తెలపాలని 9121100588 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

## రైలు కింద పడి మహిళ ఆత్మహత్య



ప్రొద్దుటూరు క్రైం, మే 17, ప్రభాతవార్త: ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్ పెన్నానది వంతెన మార్గమధ్యలో విజయవాడ నుంచి ధర్మవరం వెళ్లే రైలు కింద పడి మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మృతురాలికి సంబంధించిన వారు ఎవరూ రాలేదని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. వివరాలు తెలియాల్సి ఉంది. మృతురాలిది బేతంచెర్లకు చెందినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు.

## స్టాక్ పాయింట్‌కు విద్యా కానుక కిట్లు చేరిక

కడప ఎడ్యుకేషన్, మే 17, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతి ఏటా అందించే విద్యా కానుక మండలంలోని స్టాక్ పాయింట్లకు శుక్రవారం చేరాయి. ఇందులో భాగంగా కడప సీఎస్ఐ పాఠశాలలో విద్యా కానుక కిట్లు భద్రపరిచారు. శుక్రవారం వైఎస్ఆర్ జిల్లాలోని కడప, మైదుకూరు, దువ్వూరు మండలాలకు విద్యా కానుకలో భాగంగా స్టాక్ పాయింట్లకు నోటు పుస్తకాలు చేరాయి. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, ఏసీఎంవో దశరథరామిరెడ్డిలు మాట్లాడుతూ ఈనెలాఖరి కంతా విద్యా కానుకలోని అన్ని వస్తువులు స్టాక్ పాయింట్లకు చేరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప మండల విద్యాశాఖాధికారులు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్, ఎస్ఎస్ఏ సిబ్బంది భాస్కర్, కడప మండల సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

## అల్లర్లకు పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసులు

కడప కార్పొరేషన్, మే 17, ప్రభాతవార్త: రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్‌పోల్ (ఎలక్షన్ తరువాత) జరుగుతున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకొని ఎవరైనా సరే ఎంతటి వారైనా సరే గొడవలు పెట్టుకుంటే వారిపై నాన్ బెయిలబుల్ రిజిస్టర్ చేసి వెంటనే రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని అదే విధంగా రౌడీ షీట్స్ కూడా తెరచి గ్రామ బహిష్కరణ చేయడం జరుగుతుందని కమలాపురం పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో రాజకీయ పరంగా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వారిపై గ్రూప్ అడ్మిన్‌పైన తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దయచేసి ఎవరూ గలాటాలు, గొడవలు పెట్టుకోవద్దని ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

# ఈనెల 19న అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేని విజయవంతం చేద్దాం

## - జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డా.శైలజ

రాయచోటి అర్బన్, మే 17, ప్రభాతవార్త: ఎయిడ్స్ వ్యాధితో తమ జీవితాలను కోల్పోయిన వారి జ్ఞాపకార్థం ఈనెల 19న అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించడం జరుగుతుందని జిల్లా కుష్టు ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డా.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా డిసెంబరు 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోవడంతో పాటు అలాగే మే నెల 3వ ఆదివారాన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేగా నిర్వహించుకుంటున్నామన్నారు. హెచ్ఐవీ లేదా ఎయిడ్స్ వ్యాధితో ఎంతో మంది ప్రాణాలు, జీవితాలను కోల్పోయారని వారి జ్ఞాపకార్థం ఈ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించడం జరుగుతోందని దీన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈనెల 19న రాయచోటిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డైట్ కళాశాల వరకు ప్రేమ, సంఘీభావంతో మనందరం గుర్తుంచుకుందాం, మనందరం నయం చేసుకుందాం అనే థీమ్‌తో ఈ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ ఉంటుందని తెలిపారు.

# అమ్మ చావులో.. ఆస్తి పంచాయితీ!



లక్ష్మమ్మ (ఫైల్)

**కుటుంబసభ్యుల మధ్య తేలని తగాదా**

**రెండు రోజులు ఫ్రీజర్ బాక్స్‌లోనే మృతదేహం**

**ఆస్తి పంపకాల తర్వాతే జరిగిన అంత్యక్రియలు**

**దిగజారుతున్న మానవ విలువలకు ఇదో ఉదాహరణ**

**నేరేడుచర్లటౌన్, మే 17, ప్రభాతవార్త:** తల్లి తండ్రి కుటుంబసభ్యుల బంధాల కంటే తమకు ఆస్తే ముఖ్యమని తల్లి మృతదేహాన్ని రెండు రోజులపాటు ఫ్రీజర్ బాక్స్‌లో ఇంటివద్ద ఉంచి ఆస్తి తగాదా పరిష్కారమైన తర్వాతనే దహన సంస్కారాలు చేసిన సంఘటన నేరేడుచర్ల మండలం కందులవారిగూడెంలో జరిగింది. నవ మోసాలు మోసి కని పెంచి పెద్ద చేసిన తల్లికి కనుమూసిన తర్వాత కుటుంబసభ్యులు నిర్వహించే దహన సంస్కారాలను నిర్వహించ కుండా తన ఆస్తి కోసం తగాదాలు పెట్టుకున్న కుటుంబ సభ్యుల తీరు దిగజారుతున్న మానవ విలువల పరిస్థితిని తెలియజేస్తున్నాయి. వివరాల లోకి వెళితే గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కందులవారిగూడేనికి చెందిన వేము వెంకట రెడ్డి లక్ష్మమ్మ(80) దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గతంలోనే లక్ష్మమ్మ భర్త వెంకటరెడ్డి, చిన్న కుమారుడు చనిపోయారు. దీంతో ఆమె నేరేడుచర్లలో ఉంటున్న చిన్న కుమార్తె వద్ద 5 సంవత్సరాలుగా ఉంటుంది. కాగా లక్ష్మమ్మ ఇటీవల కాలుజారి కింద పడింది. దాంతో ఆమెను మిర్యాలగూడలోని ఒక ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు.

ఈ సందర్భంలో ఆమె పరిస్థితి విషమంగా మారడంతో ఇంటికి తీసుకెళ్లండి, ఆక్సిజన్‌తోనే ఆమె బతుకుతుందని, ఆక్సిజన్ పైపు తీసివేస్తే చనిపోతుందని వైద్యులు బుధవారం తేల్చి చెప్పారు. దీంతో లక్ష్మమ్మను ఆక్సిజన్‌తోనే చిన్న కుమార్తె తమ ఇంటి వద్దకు తీసుకు వెళ్లింది. ఈనెల 15న రాత్రి 9 గంటలకు ఇంటి ముందు ఉన్న వెంచర్ వద్ద అంబులెన్స్ పార్క్ చేయించగా లక్ష్మమ్మ ఆక్సిజన్‌తో అందులోనే ఉండిపోయారు. ఈలోగా లక్ష్మమ్మ కుమారుడు అక్కడకు చేరుకొని పెద్ద మనుషులతో పంచాయితీ పెట్టించారు. లక్ష్మమ్మను కందులవారిగూడెంకు తీసుకు వెళతానని చెప్పడంతో మిగతా కూతుళ్లు ఆస్తి పంపకాల లెక్కలు తేలే వరకు అంబులెన్స్ కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. ఇదే సందర్భంలో చివరకు రాత్రి 11గం.ల సమయంలో లక్ష్మమ్మ కన్నుమూశారు. ఈ ఘర్షణలో ఎట్టకేలకు పెద్ద మనుషులు కుటుంబసభ్యుల మధ్య ఒక ఒప్పందాన్ని కుదిరించి రాజీ చేశారు. దీంతో కుమారుడు మృత దేహం కందులవారిగూడెంకు తరలించినా అక్కడ కూడా కొడుకు, కూతుళ్ల పంచాయితీ మాత్రం ఆగలేదు. లక్ష్మమ్మ గతంలో రూ.21 లక్షలు వరకు పలువురికి అప్పులిచ్చారు. ఆమె ఒంటిపై 20 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. అయితే లక్ష్మమ్మ వైద్య ఖర్చులు భరించిన చిన్న కూతురికి రూ.6 లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. మిగిలిన రూ.15 లక్షలకు సంబంధించిన పేపర్లను కొడుకు అప్పజెప్పారు. 20 తులాల బంగారు ఆభరణాలను ముగ్గురు కూతుళ్లు పంచుకున్నారు. అంతా అయిపోయిందిలే అనుకున్న సమయంలోనే కుమారుడు కొత్త పేచీ పెట్టాడు.

తాను అంత్యక్రియల ఖర్చు భరించలేనని, తనకు డబ్బులిస్తేనే తలకొరివి పెడతానని మొండికేయడంతో తిరిగి వారి పంచాయితీ మళ్లీ మొదటకొచ్చింది. ఎట్టకేలకు శుక్రవారం పెద్ద మనుషులు నగదు, బంగారం పంపకాన్ని యధావిధిగా కొనసాగించాలని, కుమారుడు అంత్యక్రియలు చేపట్టాలని పంచాయితీ పరిష్కరించి చెప్పడంతో చివరకు అంత్యక్రియలు జరిపారు. ఈ విషయం తెలిసిన ప్రజలు కుటుంబ సభ్యులు ప్రవర్తించిన తీరు పట్ల బాధను వ్యక్తం చేసి ఆస్తి కోసం తల్లి మృతదేహం వద్ద పంచాయితీ చేయడాన్ని తప్పు పడుతూ సమాజంలో కుటుంబ విలువలకు చోటు లేకుండా పోతుందని డబ్బు కోసం దిగజారుడుతనం చేస్తున్న తీరును నిరసిస్తూ ముక్కున వేలు వేసుకొని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# వెంకట్రామిరెడ్డిని డిస్‌క్వాలిఫై చేయండి.. లేకపోతే ఢిల్లీకి వెళ్లి ఫిర్యాదు చేస్తా

### సిఇఒను కలిసిన బిజెపి మెదక్ ఎంపి అభ్యర్థి రఘునందన్‌రావు



శుక్రవారం సిఇఒ వికాస్‌రాజ్‌ను బిజెపి మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు కలిసి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 17:** తెలంగాణ సిఇఒ వికాస్‌రాజ్‌ను బిజెపి మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు శుక్రవారం కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రామిరెడ్డి డిస్‌క్వాలిఫై చేయాలంటూ సిఇఒకు రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఒక్కో ఓటర్‌కు వెంకట్రామిరెడ్డి రూ.500 పంపిణీ చేశారంటూ రఘునందన్‌రావు తన ఫిర్యాదులో తెలిపారు. పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు కట్టి ఎన్వలప్ కవర్లలో ఒక్కో గ్రామానికి డబ్బుల పంపిణీ చేశారంటూ రఘునందన్‌రావు ఆరోపించారు. దీనిపై స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. 20కి పైగా కార్లు ఉన్నాయని ఫిర్యాదు చేస్తే చేగుంట ఎస్ఐ ఒక్క కారును పట్టుకున్నారని, అందులో డబ్బులు దొరికాయన్నారు. దీనిపై సిద్దిపేట సీపీ, మెదక్ ఎస్పీకి సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. తెలంగాణలో ఇంకా బిఆర్ఎస్ అధికారంలో ఉందని పోలీసులు అనుకుంటున్నారని మండిపడ్డారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో హరీశ్‌రావు, మరో ఆరుగురు ఎమ్మెల్యేలు డబ్బుల పంపిణీ చేశారని ఆరోపించారు. రూ.84లక్షలు 27 పోలింగ్ బూత్‌లకు పంపిణీ చేసే డబ్బులు ఒక్క కారులో దొరికాయని ఆరోపణలు చేశారు. ఇక్కడ న్యాయం జరగకపోతే ఢిల్లీకి పోయి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఎఫ్ఐఆర్‌లో వెంకట్రామిరెడ్డి పేరును ఏ5గా చేర్చారనేది ఎలక్షన్ కమిషన్ గుర్తించాలని సూచించారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 926 కేంద్రాలు

### విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు జారీ

### 4.26 లక్షల మంది దరఖాస్తు

### ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకి సంబంధించి విద్యార్థుల హాల్ టికెట్లను బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఇందుకు సంబంధించి విద్యార్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినప్పటికీ డౌన్‌లోడ్ హాల్ టికెట్లను అనుమతించాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్స్(సీఎస్‌వో)లను బోర్డు కార్యదర్శి ఆదేశించారు. విద్యార్థుల హాల్ టికెట్‌లో ఏమైనా పొరపాట్లు జరిగి ఉంటే సవరించుకోవాలని సూచించారు. ఫోటో సరిగా ఉందా? లేదా? సంతకం సరిగా ఉందా? పేరు, మీడియం, పరీక్ష రాబోయే సబ్జెక్టుల వివరాలు అన్ని సరిగా ఉన్నాయా? లేదా సరి చూసుకోవాలని.. ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే కాలేజీ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లాలని.. లేదా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) దృష్టికి తీసుకెళ్లాలని విద్యార్థులకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా సూచించారు. పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం 926 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 2,54,100 మంది, ఒకేషనలన విద్యార్థులు 18,896 మంది దరఖాస్తు చేసుకోగా.. ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 1,37,994 మంది, ఒకేషనల్ విద్యార్థులు 15,085 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకి 4,26,075 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు.. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తారు. ఇంటర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలను జూన్ 4 నుంచి 8 వరకు నిర్వహిస్తారు.

# అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రోడ్డు ప్రమాదంలో మృతి

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), మే 17, ప్రభాతవార్త:** అమెరికాలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రోడ్డు ప్రమాదం నుంచి బయటపడి మరో కారు ఢీకొని దుర్మరణం చెందాడు. అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అబ్బరాజు పృథ్వీ రాజ్(30) దుర్మరణం పాలయ్యారు.



పృథ్వీరాజ్ (ఫైల్)

విద్యుత్తు శాఖ రిటైర్ ఉద్యోగి అబ్బరాజు వెంకటరమణ కుటుంబం హైదరాబాద్ చైతన్య పురి పోలీసు స్టేషన్ పరిధిలోని అలకాపురిలో నివాసం ఉంటున్నారు. అబ్బరాజు వెంకటరమణ 2021లో రెండేళ్ల కిందటే అనారోగ్య కారణంగా మృతి చెందారు. వెంకటరమణ కుమారుడు పృథ్వీరాజ్ ఎనిమిదేళ్లుగా యూఎస్ లోని నార్త్ కరోలినాలో అడ్కో సాఫ్ట్వేర్ కంపెనీ లో ఇంజనీర్ గా పనిచేస్తున్నారు.

2022 సంవత్సరంలో ఏప్రిల్ 21న శ్రీప్రియతో వివాహం కూడా జరిగింది. భార్యతో కలిసి ఈనెల 15వ తేదీ బుధవారం కారులో ప్రయాణిస్తున్నారు. వర్షం కారణంగా ముందు వెళ్తున్న మరో కారును ఢీ కొట్టారు. అది పల్టీలు కొట్టడం, తమ కారులో బెలూన్లు తెరుచుకోవడంతో దంపతులిద్దరూ సురక్షితంగా బయటపడ్డారు. భార్యను కారులోనే కూర్చోబెట్టి బయటికి వచ్చిన పృథ్వీరాజ్ ప్రమాద ఘటనపై పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం చెరవేస్తుండగా వేగంగా వచ్చిన మరో కారు ఆయన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పృథ్వీరాజ్ మృతి చెందాడు. అమెరికాలో పృథ్వీరాజ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని సమాచారం తెలిసిన తల్లి, చెల్లెలు విలపించారు. అమెరికాలో పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని ఆదివారం హైదరాబాద్‌కు తీసుకు రానున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

# గృహ సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు

### వ్యవసాయ మంత్రి

### తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త :** తెలంగాణలోని పదవీ కాలం ముగిసిన గృహ సహకార సంఘాలు (హౌసింగ్ సొసైటీలు)కు త్వరలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సెక్రటేరియట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కొత్త రైస్ మిల్లుల ఏర్పాటు, మిల్లుల ఆధునీకరణను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్, జౌళి శాఖల్లో ఒకే విధమైన కార్పొరేషన్లను ఒకే గొడుగు కిందికి తెస్తామని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తద్వారా అకాల వర్షాల వల్ల రైతులు పంట నష్టపోకుండా ఉండేందుకు గిట్టుబాటు కల్పించేలా ప్రతీ జిల్లాలోనూ వీటిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నేత కార్మికులకు ఏడాది పొడవునా పని కల్పించేలా చర్యలు తీసుకోనున్నామన్నారు. నేత పరిశ్రమ ఆధునీకరణకు 350 కోట్ల రూపాయలు కేటాయిస్తామని వెల్లడించారు. కోహెడ్ మార్కెట్లో అంతర్జాతీయంగా పండ్ల ఎగుమతులు జరిగే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మార్కెటింగ్, గిడ్డంగుల సంస్థలకు చెందిన గోడౌన్లపైన సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అంతేకాకుండా బుగ్గపాడు మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో వచ్చే నెలలో పరిశ్రమల ప్రారంభోత్సవం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# రిజర్వేషన్లు పెంచాకే సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు నిర్వహించాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపి.ఆర్.కృష్ణయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, లాల్‌కృష్ణ, నీలం వెంకటేష్ తదితరులు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం కులగణన చేసి ,జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాకనే సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కాచిగూడలో నిర్వహించిన వివిధ బిసి సంఘాల సమావేశానికి కృష్ణయ్య ముఖ్యఅతిగా ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలుస్తుందని బిసి రిజర్వేషన్లు పెంచకుండా వాటిని నిర్వహించొద్దన్నారు. ఒకవైపు కులగణన చేస్తామని చెప్పి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా బహిరంగ సభల్లో ప్రతిరోజు కులగణన జరుపుతామని, దాని ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు పెంచి బడ్జెట్ కేటాయిస్తామని బిసి ఎజెండా ఎత్తుకుని బిసిల అభిమానం చూరగొంటుంటే ఇక్కడ బిసిలకు అన్యాయం చేయడం తగు న్యాయమా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 42శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు జరపాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. లాల్‌కృష్ణ, గుజ్జకృష్ణ, నీలం వెంకటేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసమావేశానికి దానకర్ణాచారి, జనార్థన్, నందగోపాల్, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఎంపిల పేరుతో వైద్యం చేస్తే కఠిన చర్యలు

### తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త :** ఆర్‌ఎంపిలు వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలకు ముప్పు తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్‌ఎంసి) హెచ్చరించింది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లింగాపూర్ గ్రామంలో డా.రాజ్‌కుమార్ నేతృత్వంలో టీఎస్‌ఎంసి ప్రత్యేక బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. అక్కడ ఆర్‌ఎంపి వైద్యురాలు మమత ఎలాంటి అర్హతలు లేనప్పటికీ కనకవ్వ అనే మహిళకు హైడోస్ యాంటీబయాటిక్స్ ఇతర మందులను సెలైన్‌లో కలిపి ఇచ్చిన కారణంగా ఆమె ప్రాణాలకు ముప్పు ఏర్పడింది. ఈ విషయంపై టీఎస్‌ఎంసి ప్రత్యేక బృందం బాధితురాలిని ఆరా తీసింది. ఇలాంటి నకిలీ వైద్యులపై నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామనీ, ఇకపై క్రమం తప్పకుండా తనిఖీలు జరిపి ఎన్‌ఎంసి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# హార్డ్‌వేర్ దుకాణంలో అగ్నిప్రమాదం

### రూ.2 కోట్లు ఆస్తినష్టం

### ముగ్గిరిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



హార్డ్‌వేర్ దుకాణంలో కాలి బుడిదైన సామాగ్రి

**వికారాబాద్, మే 17, ప్రభాతవార్త:** హార్డ్‌వేర్ దుకాణంలో విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా మంటలు చేలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. మంటల్లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను, ఓ వృద్ధురాలిని అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు రెస్క్యూ చేసి ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండలం కుమ్మరిపల్లి తాండకు చెందిన నెనావత్ కృష్ణ కొన్ని సంవత్సరాల క్రితం వికారాబాద్‌లోని రామయ్య గూడ రోడ్డులో తన తల్లి నాగలక్ష్మీ పేరుతో హార్డ్‌వేర్ దుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. నెనావత్ క్రిష్ణ అతని భార్య, పిల్లలు, తల్లి నాగలక్ష్మీ హార్డ్‌వేర్ దుకాణంపై అంతస్తులోనే నివాసం ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారు జామున 3.30 గంటలకు దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు పెద్ద ఎత్తున చేరుకుని స్థానిక పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పైఅంతస్తులో ఉన్న తన తల్లి నాగలక్ష్మీ, ఇద్దరు చిన్నారులను కాపాడాలని కోరుతూ అగ్నిమాపక సిబ్బందికి పోలీసులకు బాధితుడు కృష్ణ మొరపెట్టుకున్నారు. సిఐ నాగరాజు, అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ చేసి ఇద్దరు చిన్నారులను, వృద్ధురాలిని కాపాడారు. 4 గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను ఆర్పి వేశారు. అప్పటికే దుకాణంలోని సామాగ్రి కాలి బుడిదైంది. దాదాపు రూ.2 కోట్ల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు కృష్ణ తెలిపారు.

**ఆర్థిక సాయం అందించిన పలువురు ప్రముఖులు**

అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు బాధితుడు నెనావత్ కృష్ణను కలిసి పరామర్శించి తోచిన విధంగా ఆర్థిక సహాయం చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అర్థ సుధాకర్‌రెడ్డి బాధితుడికి రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా వ్యాపారి అశోక్ రూ.10 వేలు, కౌన్సిలర్ సురేశ్ రూ.5 వేలు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల సైతం ఆర్థిక సాయం అందజేశారు.

# భారత్ విద్యార్థులకు ఫీజు రాయితీల పేరిట టోకరా

### సిసిఎస్‌కు చిక్కిన కేటుగాడు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** అమెరికాలో చదువుతున్న భారత విద్యార్థులకు ఆయా యూనివర్శిటీలు జారీచేసే సెమిస్టర్ ఫీజులో పది శాతం రాయితీ ఇస్తానని నమ్మించి ఇక్కడ వున్న విద్యార్థుల తల్లిదండ్రులను నిండా ముంచుతున్న ముగ్గురు కేటుగాళ్ల భాగోతం ఇది. ఈ కేసు కు సంబంధించి ఒక నేరగాడిని సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిసిఎస్ డిసిపి శ్వేత శుక్రవారం నాడు మీడియాకు వెల్లడించారు. ఎపికి చెందిన కనోలి యా అశోక్ కుమార్ (28) తన మిత్రులు అమెరికాకు చెందిన తరుణ్ రావు, ఢిల్లీకి చెందిన వకార్ లతో కలిసి ఢిల్లీలో పలు కన్సల్టన్సీ కంపెనీలలో పనిచేశాడు. ఈ కంపెనీలు భారత్‌కు చెందిన విద్యార్థులను అమెరికాలోని పలు యూనివర్శిటీలకు పంపుతుంటాయి. ఈ క్రమంలో అశోక్ కు మార్కు అమెరికా యూనివర్శిటీలకు సంబంధించి కొంత అవగాహన ఏర్పడింది. దీనినే పెట్టుబడిగా పెట్టిన అశోక్ కుమార్ తన మిత్రులు తరుణ్ రావు, వకార్‌లతో కలిసి మోసాలకు తెరలేపాడు. తనకు అమెరికాలోని చాలా యూనివర్శిటీలు తెలుసునని, అక్కడి అధికారులతో మాట్లాడి సెమిస్టర్ ఫీజులో పది శాతం రాయితీ ఇప్పిస్తానని పలువురిని మోసం చేయసాగాడు.



సిసిఎస్‌కు చిక్కిన కేటుగాడు

అమెరికాలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు భారత్‌లో వున్న విషయాన్ని గ్రహించి వారికి టోకరా వేయసాగాడు. ఇతని మాటలకు నమ్మి నగరంలోని తిరుమల్‌గిరికి చెందిన ఓ వ్యక్తి నాలుగు లక్షల 38 వేల 599 రూపాయలు మోసపోయాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సిసిఎస్ పోలీసులు మోసగాళ్ల త్రయంలో అశోక్ కుమార్‌ను అరెస్టు చేశారు. నింది తుడి వద్ద ఒక మొబైల్ ఫోన్‌ను జప్తు చేశారు. కాగా ఈ తరహా మోసాలపట్ల ప్రజలు జాగ్రత్తగా వుండాలని డిసిపి శ్వేత కోరారు.

# కెఎ పాల్‌పై చీటింగ్ కేసు నమోదు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కిలారి ఆనంద్ పాల్ (కెఎ పాల్)పై నగరంలోని పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయ్యింది. గత నవంబర్ నెలలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌బి నగర్ నుంచి తనకు ఎంఎల్ఎ టికెట్ ఇస్తానని నమ్మించి 50 లక్షల రూపాయలు తీసుకున్న పాల్ ఆ తరువాత తనకు టికెట్ ఇవ్వకుండా మోసం చేశాడని రంగారెడ్డి జిల్లాకు చెందిన కిరణ్ కుమార్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదయ్యింది. కెఎ పాల్‌కు తాను 30 లక్షల రూపాయలు ఆన్‌లైన్‌లో చెల్లించి మిగతా సొమ్మును పలు దఫాలుగా నేరుగా ఇచ్చానని బాధితుడు పోలీసులకు తెలిపాడు. దీనికి సంబంధించి అతను కొన్ని ఆధారాలను పోలీసులకు ఇచ్చాడు. కాగా ఈ నెల 13వ తేదీన జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పాల్ వైజాగ్ నుంచి పోటీ చేయడం తెలిసిందే.

# బిఆర్‌ఎస్ పార్టీ ఉండదన్న వ్యాఖ్య సమంజసం కాదు

### కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి ఆసక్తికర ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 17:** తెలంగాణలో బిఆర్‌ఎస్ పార్టీ ఉండదు అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అనడం సమంజసం కాదని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ విజయశాంతి అన్నారు. బిఆర్‌ఎస్‌పై కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆమె ఎక్స్(ట్విట్టర్) వేదికగా ఖండించారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ అనే పార్టీ ఇక ఉండదు అని అంటున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుల వారి అభిప్రాయం సమంజసం కాదని, ప్రాంతీయ భావోద్వేగాలు ప్రజా మనోభావాలను వారి ఆత్మాభిమానం వైపు నడిపిస్తూనే వస్తుండటం దక్షిణాది రాష్ట్రాల సహజ విధానం అని తెలిపారు.

ఇది అర్థం చేసుకోకుండా వ్యవహరించే వారికి... దక్షిణాది దశాబ్దాలుగా కరుణానిధి, ఎంజీఆర్, ఎన్టీఆర్, రామకృష్ణ హెగ్డే, జయలలితల నుంచి ఇప్పటి బిఆర్‌ఎస్, వైసీపీ దాకా ఇస్తున్న రాజకీయ సమాధానం విశ్లేషించుకోవాల్సిన తప్పని అవసరం ఉందన్నారు. ఎన్నడైనా ఇది వాస్తవమన్నారు. దక్షిణాది స్వీయ గౌరవ అస్థిత్వ (ఆత్మగౌరవం) ఉందన్న సత్యం కాంగ్రెస్ అర్థం చేసుకున్నట్లు... బిజెపి కనీసం ఆలోచన చేయలేదని కిషన్‌రెడ్డి మాటల ద్వారా తెలుస్తుందన్నారు. ఆమె చివరలో హరహర మహాదేవ్, జై తెలంగాణ అంటూ ముగించారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ నేతగా ఉన్న విజయశాంతి బిఆర్‌ఎస్‌పై చేసిన విమర్శలకు స్పందించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది. దక్షిణాది మీద ఉన్న ప్రేమతో కౌంటర్ ఇచ్చారా? లేక కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు అభించట్లేదని ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

# పోలీసు అధికారిగా మారి.. మహిళ నుంచి రూ.60 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు

### గంటలోనే సొమ్మంతా జప్తు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో!

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు మాయమాటలతో అమాయకులను బెదిరించి దోచుకోవడం ఆగడంలేదు. అయితే ఇదే సమయంలో దీనిపై బాధి తులు వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేస్తే చాలావరకు నేరాలను నివారించే వీలుండడంతో పాటు వారు పోగొట్టుకున్న సొమ్ములో చాలా వరకు జ ప్తు చేసే అవకాశం వుంది. కొన్నిసార్లు మొత్తం సొమ్ము నేరగాళ్ల బ్యాంకు ఖాతాలో వుండగానే పోలీసులు జప్తు చేస్తున్నారు. ఇలాంటి ఓ ఘటన ఇది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్ దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. సైబరాబాద్ పరిధిలో నివసించే ఓ మహిళకు ఈ నెల 15వ తేదీ రాత్రి మహారాష్ట్ర నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి తాను మహారాష్ట్రకు చెందిన పోలీసు అధికారినని, మీపై మనీ లాండరింగ్ కేసు నమోదయ్యిందని, ఈ కేసు నుంచి బయటపడాలంటే తనకు వెంటనే భారీగా డబ్బులు ముట్టచెప్పాలని డిమాండ్ చేశాడు. ఆరోజు రాత్రంతా ఆ నేరగాడు సదరు మహిళతో స్కైప్ వీడియో ద్వారా పలుమార్లు బెదిరించి చివరకు 60 లక్షల రూపాయలు ఫోన్ ద్వారా పలుదఫాలు రాబట్టుకున్నాడు. దీనిపై బాధిత మహిళ మరుసటి రోజున అంటే ఈ నెల 16వ తేదీన వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేసి తనకు ఎదురైన అనుభవాన్ని చెప్పింది. దీనిపై హెల్ప్‌లైన్ సిబ్బంది వెంటనే స్పందించి బాధిత మహిళ వివరాలు తీసుకుని ఆమె ఫోన్ ద్వారా నగదు బదలాయింపు జరిగిన బ్యాంకు వివరాలను సిఎఫ్‌సిఎఫ్ఆర్ఎంఎస్ పోర్టల్ ద్వారా తెలుసుకున్నారు. ఆ నగదు బదలాయింపు ఎస్‌బిఐ బ్యాంకు ద్వారా జరిగిందని తెలుసుకుని, ఇవి ఏ బ్యాంకు ఖాతాకు వెళ్లిందో కూడా నిమిషాల వ్యవధిలోనే తెలుసుకున్నారు. అనంతరం దీనిపై ఎస్ బిఐ అధికారులతో పాటు నగదు వెళ్లిన బ్యాంకు అధికారులకు సమాచారం అందించి ఆ ఖాతాలో వున్న బాధిత మహిళకు చెందిన 60 లక్షల రూపాయలను సైబర్ నేరగాడు విత్‌డ్రా చేయకుండా చూడగలిగారు. దీంతో బాధిత మహిళ సైబర్ నేరగాడి మాటలకు భయపడి ఇచ్చిన 60 లక్షల రూపాయలు వెనక్కి వచ్చినట్లయ్యింది. ఇదంతా కేవలం గంట వ్యవధిలోనే జరగడం గమనార్హం. కాగా ఈ కేసులో బాధిత మహిళ ఫిర్యాదుపై వెంటనే స్పందించి ఆమె పోగొట్టుకున్న 60 లక్షల రూపాయల నగదును నేరగాడు కాజేయకుండా ఆపడంలో కీలకంగా వ్యవహరించిన 1930 కాల్ సెంటర్ ఎస్ఐ శిరీషా కానిస్టేబుళ్లు రెహమాన్, కృష్ణను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అభినందించి వారికి రివార్డు ప్రకటించారు. సైబర్ నేరగాళ్ల మాయమాటలకు ఎవరూ భయపడవద్దని, ఒకవేళ ఎవరైనా మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేయాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ కోరారు.

## ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ముద్దనూరు, మే 17, ప్రభాతవార్త:
ముద్దనూరు మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ ఎదురుగా ముద్దనూరు నుండి ప్రొద్దుటూరు వైపు వెలుతున్నట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లి గ్రామానికి చెందిన షరీఫ్(డ్రైవర్) కు తలకు తీవ్ర గాయాలై కుడి చేయి విరిగినట్లు స్థానికులు తెలిపారు. 108 వాహణానికి సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకుతరలించినట్లు 108 సిబ్బంది మహేష్, సుబ్రమణ్యం తెలిపారు.

## ఎమ్మెల్యే రాచమల్లుకు ఓటమి తప్పదు-సురేష్ నాయుడు



ప్రొద్దుటూరు అర్బన్, మే 17, ప్రభాతవార్త:
ఈ నెల 13వ తేది జరిగిన ఎన్నికలలో మునుపెన్నడూ లేని విధంగా ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొనిఓటు హక్కును వినియోగించుకున్నారనరి, ఇది ఓర్వలేని వైసీపీ టీడీపీనాయకులు, పోలింగ్ ఏజెంట్లు, కార్యకర్తలపై దాడులు చేశారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయుడుకొర్రపాడు రోడ్డులోని అన్న క్యాంటీన్ నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో అన్నారు. గతంలో టిడిపిని భూ స్థాపితం చేస్తామన్న ప్రొద్దుటూరు నియోజకవర్గ వైసీపీఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి దారుణ ఓటమి తప్పదని, భారీ మెజార్టీతో ఇక్కడ టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజుల రెడ్డి గెలవనున్నట్లు ఆయన జోష్యం చెప్పారు. వైసీపీ పతనం మొదలైందని, బాబుపై రాచమల్లు చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు, ఇకపై టీడీనీ నాయకులను కానీ, కార్యకర్తలకు కాని విమర్శిస్తే ఓర్చుకునే ప్రసక్తే లేదనిఆయన హెచ్చరించారు. సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు ఈవి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూరాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అలాగే నియోజకవర్గంలో రాచమల్లుశకం ముగిసిందని, భారీ ఓట్ల మెజార్టీతో వరద గెలవనన్నట్లు అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికలు అధికారదర్పానికి నీతి నిజాయితీగా జరిగిన ఎన్నికలుగా ఆయన అభివర్ణిస్తూ, నిజాయితి గత టీడీపీ అభ్యర్థి వరదకు ప్రజలు బ్రహ్మరథం పట్టి గెలుపు దిశంగా పయనింప చేశారనిప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. దౌర్జన్యకాండ సృష్టించి ఈ ఎన్నికలలో వైసీపీ గెలవాలని పన్నాగాలు పన్నినట్టు, వైసీపీ నాయకులు ఓటమి చవిచూస్తున్నప్పటికిఇంకా దాడులు ఆగలేదని, ఇకనైనా వైసీపీ నాయకులు ఇలాంటి దుశ్చర్యలు ఆపకుంటే రానున్న రోజులలో ప్రతి చర్యలు దాడులు తప్పవని విఎస్ ముక్తియార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ మునీర్, మాజీ కౌన్సిలర్ అంజి, మహిళా నాయకురాలు భోగాల లక్ష్మి నారాయణమ్మ, మాజీ జడ్పీటీసీ వెల్లాల భాస్కర్, జనసేన నాయకులు జీలాన్, మాజీ కౌన్సిలర్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి నియంత్రణలో ఉంచుకోకుంటే ప్రమాదమే



ప్రొద్దుటూరు అర్బన్, మే 17, ప్రభాతవార్త:
ప్రపంచ రక్తపోటు దినోత్సవం సంధర్బంగా స్థానిక శ్రీరాముల పేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ నందు బిపి గురించి వైద్యాధికారిడా. భరత్ నారాయణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధబ్బంగా వారు మాట్లాడుతూ శరీరంలో రక్తప్రసరణ సజావుగా లేకపోతే హెచ్చు తగ్గుల వలన బీపీవస్తుందని, షుగర్ కంటే బిపి ప్రమాదమని ఎందుకంటే సడెన్ గా బిపి హై కావచ్చు లేదా లో కావచ్చునని, రెండూ ఇబ్బందికరమే కనుక 30-35 దాటిన ప్రతి ఒక్కరూబ్లడ్ ప్రషర్ గురించి తెలుసుకొని తగునియంత్రణలో ఉంచుకోవాలని, ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న జీవణ సరళి కారణంగా బిపి రోగుల సంఖ్య పెరిగిపోతుందని, ఇదిదృష్టిలో ఉంచుకొని ప్రపంచ ఆరోగ్య సంస్థ వరల్డ్ హైపర్ టెన్షన్ లీగ్‌ని స్థాపించి ప్రపంచవ్యాప్తంగా బిపిని కంట్రోల్ చేయడానికి ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ రక్తపోటుదినంగా నిర్ధారించి ప్రజల్లో అవగాహణ కల్పించేందుకు ఎన్నో చర్యలు చేపడుతోందని ఏటా సుమారూ 75లక్షల మరణాలు బిపి కారణంగా సంభవిస్తున్నాయని తేల్చిందని బిపిఉండవలసిన స్థాయిలో ఉండాలని, తగ్గినా పెరిగిన ప్రమాదమని బిపి మనకి రాకుండా కొన్ని జాగ్రత్తలు మనం తీసుకోవాలన్నారు. తల తిరగడం, కళ్ల మసకబారడం, నీరసం వంటివి లో బిపి లక్షనాలు, విపరీతమైన తలనొప్పి, జ్వరం, అలసట వంటివి హై బీపీ లక్షనాలు అన్నారు. ఇప్పుడు బీపీ కంట్రోల్‌తేవడానికి ఎన్నో మంచి మెడిసిన్స్ వచ్చాయని డాక్టర్ సలహా ప్రకారం రెగ్యులర్‌గా వేసుకోవాలని అన్నారు. బిపి ఉన్న వారు స్మోకింగ్, డ్రింకింగ్ అలవాటుంటే మానేయాలనిఅలాగే బిపి గురించి మనకి తెలిసిన విశయాలు నలుగురికి చెప్పి నియంత్రణకు మనవంతు కృషి మనం చేద్దామని ప్రతిజ్ఞ చేపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలోహెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్‌కు అంతరాయం,

మైదుకూరు మే 17,ప్రభాతవార్త :
మైదుకూరు సబ్‌డివిజన్ పరిదిలోని మైదుకూరు,ఖాజీపేట మండల పరిదిలోని అర్బన్ మరియు రూరల్ ప్రాంతాలలో నేడు 220/33 కే.వి సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ పనుల కారణంగా ఉదయం 8:00గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విధ్యుత్ సరఫరాలో అంతాయం ఉంటుందని మైదుకూరు డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసులరెడ్డి తెలియజేశారు.కావునా మైదుకూరు,ఖాజీపేట మండల ప్రజలు గమనించవలసినదిగా కొరారు.

## బ్రహ్మంగారిమాల దరించిన భక్తుల పాదయాత్ర

మైదుకూరు మే 17, ప్రభాతవార్త
మైదుకూరు నుండి శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధికి పాదయాత్రగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మాల ధరించిన మైదుకూరు మూచునూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గురువు పీరయ్య సన్నీధిలో ప్రొద్దుటూరు రోడ్డులొని శ్రీలక్ష్మీనరసింహ్మ రైసు మిల్లు నుండి శుక్రవారం బయలుదేరి వెళ్లారు.ఈ సంధర్బంగా మాచునూరు సుబ్బరాయుడు స్వామి మాట్లాడుతూ గత 35సంవత్సరముల నుండి బ్రహ్మంగారి జీవసామాధి నాటికి బ్రహ్మంగారి మాల ధరించి పాదయాత్రగా బయలు దేరి స్వామి సన్నిధికి చేరుకొవడం ఆనవాయితిగా వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో దాదాపు 35మంది బ్రహ్మంగారి మాల దరించిన భక్తులు ఉన్నారని తెలిపారు.

### కవ్వింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

పులివెందుల టౌన్, మే 17, ప్రభాతవార్త : పులివెందుల పట్టణ పరిధిలో కవ్వింపులకు పాల్పడి ఘర్షణలకు దిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సోషియల్ మీడియాలో రాజకీయ పార్టీలకు, వర్గాలకు మధ్య రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా బహిష్కరణ, పీడీయాక్టు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## సీతారామ విగ్రహాల వితరణ:



రైల్వే కోడూరు మే 17 ప్రభాతవార్త...
రైల్వే కోడూరు మండలంలోని బూడిగుంటపల్లి హరిజనవాడకు మాజీ సర్పంచి మాజీ ఎంపీటీసీ బత్తిన గంగన్న యాదవ్ శుక్రవారం సీతారామ లక్ష్మణ హనుమంత సమేత విగ్రహాలను దళితవాడకు వితరణ అంద చేశారు. ఎంతోకాలంగా ఈ గ్రామం నందు విగ్రహాలను ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో ఎట్టకేలకు శుక్రవారం నాలుగు విగ్రహాలను దళితవాడకు అందజేయడంతో దళితులు హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిన గంగయ్య, గ్రామస్తులు తదితరుల్లు పాల్గొన్నారు

## ఉపాధి హామీ కూలీలను పెంచాలి: సిపిఐ దార్ల రాజశేఖర్

రైల్వే కోడూరు మే 17 ప్రభాతవార్త....
రైల్వే కోడూరు మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఓవనపల్లి గ్రామపంచాయతీ శింగ్గిరి వారి పల్లె గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండు గోల మణి పాల్గొన్నారు .ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుపేద కూలీలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా గత కాంగ్రెస్ ప్రభుత్వం లో ఇచ్చినట్లు, ఇప్పుడు ఉన్న నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా రోజువారి కూలి 600 రూపాయలు వరకు పెంచాలని, అదేవిధంగా ఎండాకాలం లో కూలీలకు వడదెబ్బ తగలకుండా షెల్టర్లు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేయాలని, అన్నారు. ఉపాధి కూలీల సమస్యల పై ఆయా మండలాలలో పెద్ద సంఖ్యలో స్థానిక ఎంపీడీవో , కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓవనపల్లి ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత, కనపర్తి రాజేంద్ర, ప్రవళిక, లక్ష్మీదేవి, కిట్టయ్యతోపాటు ఉపాధి కూలీల తో మాట్లాడారు.

# వైభవంగా వాసవిమాతాకు బియ్యంతో వైభవంగా పాదాభిషేకం





బద్వేలు అర్బన్, మే 17 (ప్రభాతవార్త): శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు , సెక్రటరీ నాగరాజ, జాయింట్ సెక్రటరీ సగళా సురేష్‌బాబు, ట్రెజరర్ ఇమ్మడిశెట్టి చంద్రశేఖర్, వైస్‌ప్రెసిడెంట్లు మునగా చలమయ్య, దర్శి వెంకటేశ్వర్లుతో పాటు పలువురు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి తెల్లవారుజామునుంచే వివిధ రకాల విశేష పూజలను, పంచామృతాభిషేక కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వాసవిమాత అమ్మవారిని పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించుకుని తమ బక్తిని చాటుకున్నారు.అలాగే సాయంకాలం వాసవిమాత అమ్మవారికి బియ్యంతో పాదాభిషేకం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో మాలేపాటి సురేష్‌బాబు, జొన్నలగడ్డ సుధాకర్ (వస్త్రం), కొలిశెట్టి మధు, మదుళ్లపల్లె సత్యం, గంటా నాగేశ్వరరావు, యాదాళ్ల క్రిష్ణమూర్తి, వివిద రకాల ప్రత్యేక పూలతో చేపట్టిన అలంకారం పలువురి భక్తులను ఆకట్టుకుంది. అలాగే మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, మాజీఅధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, సెక్రటరీ గంగిశెట్టి ధనలక్ష్మిలతో పాటు పలువురు మహిళా మండలి కమిటి సభ్యులతో పాటు పబ్బతి చక్రపాణి,చింతకుంట రవి, జూటూరు పద్మ, కళ్యాణి, సుగుణ, కొండపల్లి లక్ష్మికాంతమ్మ, శ్రావణి, సగళా సుశీల, వందవాసి ధనమ్మ, పబ్బతి వసంత లక్ష్మి, గొంట్ల కుమారి, చలపాటి క్రిష్ణవేణి, యాదాళ్ల సుధారాణి, కుప్పం శర్వాణి, లక్ష్మినారాయణమ్మ, చింతకుంట సుభాషిణి, మంజుల, బచ్చు పార్వతి, సముద్రాల మాదవిలత తో పాటు పలువురు పాల్గొన్నారు.ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటి సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ట్రిపుల్‌ఐటీ పరిపాలనాధికారిగా పెనుగొండు రవికుమార్ నియామకం



వేంపల్లె, మే 17, ప్రభాతవార్త :
జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పరిపాలనాధికారిగా డాక్టర్ పెనుగొండ రవికుమార్‌ను నియమిస్తూ డైరెక్టరు డాక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. డాక్టర్ రవికుమార్ జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఈయన కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఐటీ ఇన్‌ఛార్జిగా, డిపార్ట్‌మెంట్ క్రమశిక్షణ కమిటి సభ్యులుగా, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోఆర్డినేటరుగా, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ కోఆర్డినేటరుగా అదనపు బాధ్యతలు నిర్వహించడంలో ఈయన క్రియాశీలకంగా వ్యవహరించి యూనివర్శిటీకి సేవలు అందిస్తున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను క్రియాశీలకంగా నిర్వహించి యూనివర్శిటీ అభివృద్ధికి దోహదపడతానని తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## బాడీ ఫ్రీజర్ ఏర్పాటు శుభ పరిణామం



పులివెందుల రూరల్, మే 17, ప్రభాతవార్త :
సొంత డబ్బులతో బాడీఫ్రీజర్, అంతిమయాత్ర వాహనాలను ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని అబ్దుల్లాహ్ మౌలానా పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలో బుల్లెట్ బాబు తన సొంత డబ్బులతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏదో ఒక రూపంలో సహాయ, సహకారాలు అందించాలన్న ఉద్దేశంతో మరణించిన వారి అంతిమయాత్రకు సహకరించే విధంగా బాడీ ఫ్రీజర్, వాహనం, డీజిల్, డ్రైవరు సేవలు కూడా ఉచితంగానే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సేవల కొరకు 9502788074, 8125990353 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టి మతపెద్దలు, నూరుల్లా, ముఫ్తీకరిముల్లా, ముఫ్తీ రహీమ్, హాఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగించకండి

**రూరల్ సిఐ విక్రమ్ సింహ,ఎస్ఐ కేసి రాజు**




అట్లూరు,మే 17,ప్రభాతవార్త:
ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిన్న చిన్న మాట విరుపులకు తగాదాలు పెట్టుకొని కేసుల్లో ఇరుకోవద్దని బద్వేల్ రూరల్ పి.ఐ విక్రం సింహ,అట్లూరు ఎస్.ఐ కేసి రాజు,మండలంలోని ఇరు పార్టీ నాయకులు కార్యకర్తలను పిలిపించి రాష్ట్రం లో జురుగుతున్నా అవాంచనీయ సంఘటనలు జూన్ 4 తేదీన జరిగే కౌంటింగ్ నేపథ్యంలో అట్లూరు పోలీస్ స్టేషన్ నందు మండల నాయకులకు కార్యకర్తలను పిలిపించి ఎలాంటి గొడవలు కానీ ఒకరినొకరు రెచ్చగొట్టే మాటలు లాంటివి చేస్తే అటువంటి వారి పైన నాన్ బెయిల్ కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని కావున మండలం లోని నాయకులు మరియు కార్యకర్తలు శాంతి భద్రతలు విఘతం కలిగించకుండా ఉండాలని,హెచ్చరించి చేయడం జరిగింది.

## కోనంపేటలో చౌడేశ్వరి దేవికి జ్యోతిష్యవాలు



లక్కిరెడ్డిపల్లె,మే 17,ప్రభాతవార్త:
మండలంలోని కోనంపేట గ్రామంలో వెలసిన చౌడేశ్వరి దేవికి శుక్రవారం నుంచి సోమవారం వరకు జ్యోతి ఉత్సవాలు నిర్వమిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.మొదటి రోజున చౌడేశ్వరి దేవికి 108 బిందులతో అభిషేకం పంచామృతం అభిషేకం నిర్వహించారు.గ్రామస్తులు అమ్మవారికి జ్యోతులు వెలిగించి పూజలు నిర్వహించారు శనివారం పుష్పాండ మహర్షి పీఠాధిపతులు దివ్యానంద గిరి స్వాములచే జ్యోతిర్లంగ అలంకరణ ప్రారంభిస్తారని వారు తెలిపారు.ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి పూజా కార్యక్రమం నిర్వహిస్తారు.ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

## ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవు

పోరుమామిళ్ల, మే 17 (ప్రభాతవార్త):
ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్‌పోల్ సంఘటనలు దృష్టిలో ఉంచుకుని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రజలు వివిధ రాజకీయపార్టీల వారు ఎలాంటి గొడవలలో తలదూర్చరాదని, అలా గొడవలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనిపోరుమామిళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అలా గొడవలలో పాల్గొన్నా, లేక వాటిని ప్రోత్సహించినా అలాంటి వారిపై నాన్ బెయిలబుల్ కేసులు రిజిష్టర్ చేసి రిమాండ్‌కు తరలించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రౌడీషీట్ ఓపెన్ చేసి జిల్లా బహిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. కావున పై విషయాలన్ని దృష్టిలో ఉంచుకుని గొడవలు మరియు అల్లర్లకు దూరంగా ఉండాలని సూచించారు.

## హిజ్రా అనుమాన స్పద మృతి



చిన్నమండెం, మే 17, ప్రభాత వార్త :
మండలంలోని కేశాపురం గ్రామం పరిధిలోని రాయచోటి - మదనపల్లె రహదారి పక్కన గుట్టమోటు అంజనేయస్వామి గుడి వెనుక గల జమాయిల్ చెట్లు గల అటవీ ప్రాంతంలో గుర్రంకొండ మండలం నడిమికండ్రిక గ్రామం ఎగువహరిజనవాడకు చెందిన గణేష్ అనే హిజ్రా ఉరి వేసుకొన్న స్థితిలో అనుమాన స్పదంగా మృతి చెందింది. ఈ సంఘటనపై అతని అన్న శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతున్ని పోస్టుమార్టం కొరకు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

## మంచినీటి పైపు తొలగించడంపై ప్రశ్నించినందుకు దాడి - వక్తికి గాయాలు



చిన్నమండెం, మే 17, ప్రభాత వార్త :
మండలంలోని కొత్తపల్లె గ్రామంలోని మల్లూరు క్రాస్ రోడులో తన కుటుంబానికి ఉన్న పైపులైన ఎందుకు తొలగించారని అడిగినందుకు దాడి చేసి గాయపరిచిన సంఘటన చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త చిన్నప్ప దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. బిసి నాయకుడు చిన్నప్ప శుక్రవారం తన ఇంటికి మంచి నీటిని రానివ్వకుండా పైపులైన్‌ను సమర, శివారెడ్డి అనే వ్యక్తులు కట్ చేశారు. ఈ విషయంపై ప్రశ్నించగా తనపై దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. చిన్నప్ప గాయపడడంతో అతన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేస నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

## బస్టాండు జలమయం వార్తకు స్పందన



పీలేరు, మే 17 ప్రభాతవార్తః స్థానిక డిపో మేనేజరు బండ్లకుమార్ , పంచాయతీ ఎగ్జిగూటివ్ ఆఫీసర్, సివిల్ ఇంజనీర్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులోకి నల్లగుట్ట మురుగునీటి కాలువను గ్రామ పంచాయతీ సిబ్బంది జేసీబీతో శుభ్రపరచడమైంది.కాలువను శుభ్రపరిచి నీరు బస్టాండు వైపు రాకుండా చర్యలు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ పంచాయతీ మేస్త్రీ ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫోటోరైటప్ః జేసీబీతో కాలువను శుభ్రం చేస్తున్న దశ్యం(1)

## రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎలక్ట్రిషియన్ కష్ణసాయి కుటుంబానికి ఆర్థికసాయం



పీలేరు, మే 17 ప్రభాతవార్తః స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎలక్ట్రిషన్ కష్ణ సాయి కుటుంబానికి శుక్రవారం బిల్డింగ్ వర్కర్సు అసోసియేషన్
జిల్లా అధ్యక్షులు బలరామ్ ఆధ్వర్యంలో రూ.11,200లు ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రాజు, సయ్యద్‌అలీబేగ్, ఎన్టీఆర్ నఫీజ్, స్థానిక ఎమ్మార్పీయస్ నాయకులు గండికోట వెంకటేష్ చంద్రమౌళి ఆచారి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి : పరిసీలించిన సిఐ, కేసు నమోదు

వీరబల్లి, మే17,ప్రభాతవార్త :
మండలంలోని వంగిమళ్ల పంచాయితీ కస్పాలో షేక్ అల్తాఫ్ అనే వ్యక్తి పైన శుక్రవవారం తెల్లవవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతొ దాడులు చేసి గాయపరిచారు. వివరాల్లోనికి వెళితే అల్తాఫ్ అనే వ్యక్తి రోజు మాదిరే తెల్లవవారుజామున 5గంటలకే లేచి సమీపంలో ఉన్న గ్రామ సచివాలయం ప్రక్కన బహిర్భూమికి వెళ్లారు. గుర్తు తెలియని కొందరు వ్యక్తులు కాపు కాచి కత్తులతో శరీర బాగాలపై గాయపరిచారు. అదే సమయంలో ఒ ఆటో ఆదారిన వెళ్లడంతో ఆది చూసి దుండగులు పారిపోయినట్లు కుటుంభ సభ్యులు తెలిపారు. 5గంటలకు వెళ్లిన అల్తాఫ్ ఇంకా రాలేదనే అనుమానంతో అతని భార్య తన కుమార్తెను పంచించారు. ఆ సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా తన తండ్రి గాయాలతో పడి ఉండడంతో అది చూసి కుమార్తె వెంటనే ఇంటికి వెళ్లి తల్లికి బంధువులకు తెలిపింది. హుటాహుటిన భార్య బంధువులు అక్కడికి చేరుకొని గాయపడిన వ్యక్తిని ఇంటికి తీసుకు వచ్చారు. ఈ విషయాన్ని వవెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న రాయచోటి రూరల్ సిఐ తులసీరాం తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన వ్యక్తిని వీరబల్లి పోలీసు స్టేషన్ వద్దకు తీసుకువచ్చి జరిగిన సంఘటనపై విచారించి కేసు నమోదు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల పేర్లు కూడా కుటుంబ సభ్యుల ద్వారా పోలీసులు సేకరించడం జరిగింది. అనంతరం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. గామనడిన వ్యక్తికి 8 మంది పిల్లలు భార్య కలరు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వైసిపి నాయకులు కుటుంభ సభ్యులను పరామర్శించారు.

